అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కారు రిపేరు..

షెడ్డు దారిలో కారు

- మరమ్మతులు చేసే పనిలో అధిష్ఠానం..
- కారు రిపేర్ కష్టమే అంటున్న విశ్లేషకులు
- క్యాడర్ లో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తి..
- క్రమక్రమంగా దూరమవుతున్న నేతలు
- కాంగ్రెస్ లోకి మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య!
- అదే బాటలో మార్నేని రవీందర్ రావు..?
- తూర్పులో కారు దిగేందుకు సిద్ధమైన కార్పొరేటర్లు
- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ను వీడుతున్న గులాబీ నేతలు

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి : కారు రిపేరుకొచ్చింది. షెడ్డు దిశగా పయనం చేస్తున్నది. దీంతో గులాబీ కేడర్ ఒక్కొక్కరు కారు దిగిపోతుండగా.. అధిష్ఠానం మాత్రం రిపేర్ చేసి జెట్ స్పీడ్ తో దూసుకెళ్తామనే పనిలో ఉంది. కానీ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుత పరిణామాలు చూస్తే శాశ్వతంగా కారు షెడ్డుకే పరిమితమయ్యేనా? అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పిన మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య సీఎం రేవంత్ రెడ్డి కలవగా.. ఆయన కాంగ్రెస్ లో చేరికకు లైన్ క్లియర్ అయ్యింది. తాజాగా బీఆర్ఎస్ కు చెందిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలవడం రాజకీయంగా ఆసక్తికర చర్చనీయాంశమైంది.

-దిగజారిపోతున్న బీఆర్ఎస్..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ పటిష్టత రోజురోజుకూ దిగజారిపోతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన నాయకులు ఓటమి పాలవ్వడంతో పార్టీ అధిష్ఠానం పట్టించుకోకపోవడం.. జిల్లా నాయకులు ముఖం చాటేస్తుండటం వెరసి ఆ పార్టీ క్యాడర్ లో తీవ్ర అసంతప్తి పెరిగిపోయింది. దీంతో ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇంత కాలం పార్టీ సేవ చేసినా గుర్తింపు దక్కలేదని ఓవైపు బాధపడుతూనే.. కనీసం పట్టించుకునే నాథుడే లేరని లోలోన కుమిలిపోతున్నారు. దీంతో ఒక్కొక్కరు కారు దిగి 'చేయి' పట్టుకుని నడిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇంతకాలం కాంగ్రెస్ పై అవాకులు చేవాకులు పేలిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మౌనంగా ఉంటున్నారు. మంచి ముహూర్తంలో తమ 'హస్త'వాసిని పరీక్షించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల సమయంలో కుదుపు..

రోజురోజుకూ బీఆర్ఎస్ క్యాడర్ నిస్తేజంగా మారడం.. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదనే ఆవేదన.. అధికారం పోయాక నాయకులే కనిపించకుండా పోయారనే ఆక్రోషం.. వెరసి ఒక్కొక్కరు పార్టీకి దూరమవుతున్నారు. బీఆర్ఎస్ లో ఉన్నా.. క్లీన్ చిట్ ఉన్న నాయకులకే కాంగ్రెస్ పార్టీ స్వాగతం పలుకుతుండటంతో ఇలాంటి నాయకులు త్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వివాదాల్లో తలదూర్చి పార్టీని వాడుకున్నవారు ఇప్పుడు కాంగ్రెస్ లోకి పోలేక.. బీఆర్ఎస్ లో ఉండలేక తలలు పట్టుకుంటున్నారు.

-కారులో కుదుపులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా.. రెండు నియోజకవర్గాల్లో మినహా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలిచింది. దీంతో ఒక్కసారిగా కారు పార్టీలో కుదుపులు మొదలయ్యాయి. చివరికి కారు షెడ్డుకు చేరుకునే పరిస్థితికి చేరింది. అధిష్ఠానం కారును సర్వీసింగ్ కు పంపించామని మళ్లీ త్వరలోనే నిగనిగలాడుతూ పరుగులు తీస్తుందని క్యాడర్ లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నా.. ఎవరు నమ్మడం లేదు. అసలు ఓటమి పాలైన అభ్యర్థులెవరూ కార్యకర్తలకు అందుబాటులోకి రావడం లేదు. పార్టీ పటిష్టతకు, కేడర్ లో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేయడం లేదని టాక్ నడుస్తోంది. అసలు బీఆర్ఎస్ భవిష్యత్ కార్యాచరణ ఏంటన్నదానిపై స్పష్టత లేకపోవడం.. అధిష్ఠానం కూడా ఓటమిపై ఆత్మపరిశీలన చేసుకోకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం తలోదారి చూసుకుంటున్నారు.

- ఎక్కడికక్కడ రహస్య భేటీలు

బీఆర్ఎస్ లో గెలిచిన ప్రజాప్రతినిధులు తమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు రహస్యంగా భేటీలు అవుతున్నారు. ఇప్పటికే వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్పొరేటర్లలో గుండేటి నరేందర్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్ తో పాటు కొందరు నేతలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి ఈ నియోజకవర్గంలో రహస్యంగా భేటీ అయి పార్టీ నాయకత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లలో పదకొండు మంది మంగళవారం హన్మకొండ హంటర్ రోడ్డు లోని విశాల్ మార్ట్ సమీపంలో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ లో ఉండాలా..? లేక వేరే పార్టీలో చేరాలా.. అనే అంశంపై సీరియస్ గా చర్చించినట్లు సమాచారం.. వీరంతా కాంగ్రెస్ పార్టీలో ఓ ముఖ్యనేతతో టచ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. త్వరలోనే ఈ కార్పొరేటర్లు కారు దిగి హస్తం పార్టీలో చేరేందుకు ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం.

-రాజీనామా చేసిన రాజయ్య.. కారు దిగనున్న మార్నేని..

ఇప్పటికే మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. కాంగ్రెస్ లో చేరేందుకు సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి తన మనసులోని మాట చెప్పారు. దీనికి రేవంత్ రెడ్డి నుంచి సూత్రప్రాయంగా ఆమోదం లభించినట్లు సమాచారం. ఆయన త్వరలో మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ కీలక నేత, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు త్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కొంతకాలంగా బీఆర్ఎస్ పట్ల అసంతప్తిలో ఉన్న ఆయన మరి కొందరితో కలిసి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట బీఆర్ఎస్ టిక్కెట్ అరూరి రమేశ్ కు కాకుండా మరొకరికి కేటాయించాలని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ అధిష్ఠానం టిక్కెట్ అరూరికే కేటాయించింది. కానీ, ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. దీంతో అధిష్ఠానంపై అసంతప్తిగా ఉన్న రవీందర్ రావు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఇటీవల ధాస్యం వినయ్ భాస్కర్ సోదరుడి కుమారుడైన బీఆర్ఎస్ కార్పొరేటర్ ధాస్యం అభినవ్ భాస్కర్ బీజేపీలో చేరారు. అంతకు ముందు ఈ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు మాజీ కార్పొరేటర్లు కొందరు కారు దిగి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరే కాదు, ఉమ్మడి జిల్లాలో వివిధ నియోజకవర్గాల నుంచి అర్బన్, గ్రామస్థాయిలో ఇప్పటికే పలువురు నేతలు తమ క్యాడర్ తో కలిసి కాంగ్రెస్, బీజేపీలో చేరగా ఇంకా చాలా మంది బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వేయండి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

- సింగరేణిలో ఖాళీగా ఉన్న 485 పోస్టులు భర్తీ చేస్తాం..
- మరో వెయ్యి మందికి కారుణ్య నియామకాలు
- థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత ఉండొద్దు
- 26న కొత్తగూడెంలో సోలార్ ప్లాంటు ప్రారంభం
- సింగరేణి అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

సింగరేణి కాలరీస్ లో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్ రిక్రూట్ మెంట్ పోస్టులను, అలాగే 168 ఇంటర్నల్ రిక్రూట్ మెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు వీలుగా నోటిఫికేషన్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి చైర్మన్ అండ్ఎం.డీ బలరామ్ నాయక్ ను ఆదేశించారు. సింగరేణిలో కారుణ్య నియామక ప్రక్రియను వేగంగా చేపట్టాలని, ఈ ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, డైరెక్టర్(పర్సనల్), ఎన్.వి.కె.శ్రీనివాస్, ఇతర అధికారులతో డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉద్యోగాల నియామక ప్రక్రియ చాలా పారదర్శకంగా ఉండాలన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. నోటిఫికేషన్ల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలని సూచించారు.

సింగరేణి అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

ముఖ్యమంత్రి సింగరేణి ఉద్యోగ మేళాలో ఇచ్చిన హామీ మేరకు వారసుల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచే విషయంలో వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. సింగరేణి కార్మికుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేకుండా చేసుకున్న రూ.కోటి ప్రమాద బీమా అవగాహన ఒప్పందం పురోగతి గురించి ఆరా తీశారు. ప్రమాదభరితమైన బొగ్గు రంగంలో పనిచేస్తున్న 43 వేల మంది ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించిన వారమవుతామని తెలిపారు. ఇప్పటి వరకు కోల్ ఇండియాలోనూ ఇలాంటి ఒప్పందం లేదని, త్వరలో మిగిలిన బ్యాంకులతోనూ ఈ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ బలరాం ఉప ముఖ్యమంత్రికి వివరించారు. కోటి ప్రమాద బీమాపై కార్మికులకు అవగాహన కల్పించాలని డిప్యూటి సీఎం సూచించారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ను ఈ నెల 26న ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం సింగరేణి అధికారులను ఆదేశించారు. సింగరేణి ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం హైదరాబాద్ లో నిర్మించనున్న అతిథి గృహం భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరై శంకుస్థాపన చేస్తామన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం సహకారం అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే కాకుండా గోదావరి ఖని, మంచిర్యాల కార్మికులకు సురక్షిత మంచినీరు అందించేందుకు వీలుగా చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లను ప్రారంభించాలని అన్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై రోజువారీ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలన్నారు. కాగా, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణిలో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్, 168 ఇంటర్నల్ పోస్టులకు గురువారం నోటిఫికేషన్ల ను జారీ చేస్తున్నామని ఆసంస్థ చైర్మన్ అండ్ఎండీ శ్రీ ఎన్.బలరాం వెల్లడించారు